చెప్పాడంటే.. చేస్తాడంతే!

- మేనిఫెస్టోలో మహిళలు, రైతులు, విద్య, వైద్యానికి పెద్దపీట
- సీఎం వైఎస్ జగన్ చేయగలిగినవే చెప్పారు
- మేనిఫెస్టోపై ప్రజల్లో సర్వత్రా హర్షం



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ) : రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అంటేనే ప్రజలకు నమ్మకం, విశ్వాసం... ఆయన ఏదైనా చెప్పారంటే ఎంత కష్టమైనా చేసి తీరుతారని ప్రజల ప్రగాఢ విశ్వాసం. 2019 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అన్ని వర్గాల సంక్షేమానికి పెద్దపీట వేస్తూ నవరత్నాల పథకాలు అమలులోకి తెచ్చారు. కేవలం రెండు పేజీలతో తయారు చేసిన మేనిఫెస్టోను పవిత్ర గ్రంథంగా భావించారు. దాంట్లో చెప్పినవి 99 శాతం అమలు చేశారు. చెప్పనివి కూడా కొన్ని అమలు చేశారు. ధైర్యంగా మళ్లీ ఎన్నికలకు సిద్ధమయ్యారు. ఈ నేపథ్యంలో 2024 ఎన్నికల మేనిఫెస్టోను శనివారం పార్టీ కేంద్ర కార్యాలయంలో విడుదల చేశారు. ఈ మేనిఫెస్టోపై ప్రజల్లో సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

మహిళా పక్షపాతి జగన్



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళల పక్షపాతి. అక్కచెల్లెమ్మలు బాగుంటేనే రాష్ట్రం అన్ని విధాలా బాగుపడుతుందని ఆయన నమ్మకం. సంక్షేమం నుంచి రాజ్యాధికారం వరకు మహిళలకు పెద్దపీట వేశారు. మహిళలంతా సీఎం జగన్‌కు రుణపడి ఉంటాం.

–పి.నారాయణమ్మ, కొత్తపేట

అమ్మ ఒడి పెంపు సంతోషంగా ఉంది



మాలాంటి పేదలకు అమ్మఒడి పథకం ఎంతో ఉపయోగం. ఈ పథకం ద్వారా ఏటా రూ.15 వేలు ఇప్పటి వరకు అందుకున్నాం. ఈ మొత్తాన్ని పిల్లల అవసరాలకు వినియోగించాం. దీన్ని రూ.17వేలకు పెంచడం సంతోషం. జగనన్న చేస్తున్న మేలు ఈ జన్మలో మరచిపోలేం.

–సరగడ జీవమణి, విజయవాడ

మాలాంటి వృద్ధులకు అండ



ప్రతి నెలా ఒకటో తేదీనే ఠంచనుగా జీతం ఇచ్చినట్టు మూడు వేల పింఛన్ ఇంటి వద్దకే అందిస్తూ ఆదుకుంటున్నాడు. దానికి అదనంగా మరో రూ.500 పెంచుతానని మేనిఫెస్టోలో ప్రకటించారు. చంద్రబాబు ఇంతకన్నా ఎక్కువ ఇస్తామన్నా మాకు అక్కరలేదు.

–పిళ్లా సన్నాయమ్మ, విజయవాడ

చేనేతలకు సీఎం జగన్ చేయూతనిచ్చారు



జిల్లాలో వేలాది కుటుంబాలు చేనేత వృత్తిపైనే జీవనం సాగిస్తున్నాయి. వారిలో అర్హులందరికీ ఈ పథకం ద్వారా ఏడాదికి రూ.24 వేలు చొప్పున గత ఐదేళ్లలో రూ.1.20 లక్షలు అందించారు. ఈ పథకాన్ని రానున్న ఐదేళ్లలో కూడా ఇదేవిధంగా కొనసాగిస్తానని మేనిఫెస్టోలో చెప్పారు. చేనేత కార్మికులంతా సీఎం జగన్‌కు రుణపడి ఉంటారు.

–టి.రవీంద్రకుమార్, విజయవాడ

డ్రైవర్లకు మేనిఫెస్టోలో మేలు చేశారు



వాహనమిత్ర పథకం ద్వారా గత ఐదేళ్లలో ఏటా రూ.10 వేలు చొప్పున రూ.50 వేలు అందించారు. రానున్న ఐదేళ్లలో కూడా ఈ పథకాన్ని ఇలాగే కొనసాగిస్తానని చెప్పారు. సీఎం జగనన్నకు రుణపడి ఉంటాం. లారీ, టిప్పర్ డ్రైవర్లకు సైతం ఈ పథకాన్ని వర్తింపజేయడం సంతోషం. ప్రమాద బీమా రూ.10లక్షలు ఇస్తామని ప్రకటించడం చాలా గొప్ప విషయం

–కె.దూండీశ్వరరావు, విజయవాడ

విశ్వసనీయతకు ప్రతీక వైఎస్సార్ మేనిఫెస్టో

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): ఐదేళ్ల విలువలకు, విశ్వసనీయతకు ప్రతీకగా వైఎస్సార్ సీపీ మేనిఫెస్టో నిలిచిందని, రానున్న ఐదేళ్లు అదే విశ్వసనీయత కొనసాగించేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని నేషనల్ ట్రైబల్ ఫెడరేషన్ కోశాధికారి తోకల చినవీరోజీ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తెలుగుదేశం మేనిఫెస్టో ప్రజలను నమ్మించి మోసగించేదిగా ఉందని, ఐదేళ్లలో చేసిన అభివృద్ధి, సంక్షేమం చూసి ఓట్లు వేయమని అడిగిన ధైర్యం జగన్‌మోహన్‌రెడ్డిదని అన్నారు. చంద్రబాబునాయుడికి మేనిఫెస్టో అంటే ప్రజలను మోసం చేసే కరపత్రంగా ఉందని, వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డికి అది పవిత్ర గ్రంథమని అన్నారు. అన్ని వర్గాలు ఐక్యంగా జగన్‌మోహన్‌రెడ్డిని రెండోసారి సీఎంను చేసేందుకు ఎదురు చూస్తున్నారని, దానికి నిదర్శనం ఆదివారం జరిగిన మూడు బహిరంగ సభలేనని అన్నారు.

నేటి నుంచి ముస్లిం విద్యార్థులకు వేసవి తరగతులు

ఆటోనగర్(విజయవాడతూర్పు): ఆటోనగర్ డిస్పోజల్ మూడవ రోడ్డులోని మదరస దావతుల్ కుర్ఆన్ ఇమారత్-ఎ-షర్ ఇయ్యహ ఆధ్వర్యంలో ఈ నెల 29 నుంచి మే 31 వరకు వేసవి తరగతులు నిర్వహిస్తున్నట్టు మసీద్ గురువు రహీం తెలిపారు. 1 నుంచి 10 తరగతి లోపు విద్యార్థులు హాజరై ఈ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని ఆ ప్రకటనలో కోరారు.

క్లుప్తంగా

తెలుగు బాప్టిస్ట్ చర్చిలో ఆసిఫ్ ప్రత్యేక ప్రార్థనలు



విద్యాధరపురం(విజయవాడ పశ్చిమ): వన్‌టౌన్ 49వ డివిజన్ ప్రైజర్‌పేట తెలుగు బాప్టిస్ట్ చర్చిలో వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి షేక్ ఆసిఫ్ ఆదివారం ఉదయం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ప్రార్థనల్లో పాల్గొన్న ఆసిఫ్‌కు చర్చి పాస్టర్ మెక్సిన్ హెండ్రూస్ ఆశీర్వచనాలు అందించారు. అనంతరం ఆసిఫ్ క్రైస్తవ సోదర, సోదరీమణులను కలిసి ఎన్నికల్లో తనకు మద్దతిచ్చి తన విజయానికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ నగర అధ్యక్షుడు బూదాల శ్రీను, నాయకులు తంగిరాల కృపా, సుధీర్, జార్జి, మార్క్, ప్రమీల, విజయలక్ష్మి, రుద్రపాటి స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కును ప్రశాంతంగా వినియోగించుకోండి




చిట్టినగర్(విజయవాడపశ్చిమ): రానున్న సార్వత్రిక ఎన్నికలలో ప్రజలు తమ ఓటు హక్కును ప్రశాంత వాతావరణంలో వినియోగించుకునేలా అవగాహన కల్పిస్తున్నామని వెస్ట్ ఏసీపీ మురళీకృష్ణ తెలిపారు. కొత్తపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని విజయవాడ రూరల్ ప్రాంతాలైన షాబాద్, జక్కంపూడి గ్రామాల్లో ఆదివారం పోలీసులు మార్చ్‌ఫాస్ట్ నిర్వహించారు. వెస్ట్ ఏసీపీ మురళీకృష్ణ పర్యవేక్షణలో సీఐ గణేష్ ఆయా ప్రాంతాల్లో కేంద్ర అదనపు బలగాలు, పోలీసులు, సిబ్బందితో కవాతు నిర్వహించారు. శాంతియుత వాతావరణంలో పోలింగ్ జరిగేందుకు ప్రజలు పోలీసు శాఖతో సహకరించాలని, సంఘ విద్రోహ శక్తుల ఆటలను ప్రజల సహకారంతోనే అరికట్టేలా ఈ కవాతు నిర్వహించామన్నారు. ఎన్నికల తరుణంలో ఎటువంటి ఇబ్బందులను ప్రజలు గుర్తించినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.

విరసం ఆధ్వర్యంలో పుస్తక ఆవిష్కరణ



విజయవాడకల్చరల్: విప్లవ రచయితల సంఘం విజయవాడ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం స్వాతంత్ర్య సమరయోధుల సంఘం భవన్‌లో దేశం కార్పొరేట్లకు (కగార్ యుద్ధంలో హిందూత్వ ఫాసిస్ట్ వ్యూహం) పుస్తకాన్ని ఆవిష్కరించారు. సభకు విరసం సీనియర్ నాయకులు సీఎస్ఆర్ ప్రసాద్ అధ్యక్షత వహించారు. పౌర హక్కుల సంఘం రాష్ట్ర కార్యదర్శి చిలకా చంద్రశేఖర్ మాట్లాడుతూ దేశంలోని పలు ప్రాంతాల్లో ప్రభుత్వ ఆస్తులను అదాని, అంబానీలకు అప్పజెప్పడానికి బీజేపీ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తున్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఆదివాసులపై యుద్ధం ప్రకటించినట్లు తెలిపారు. ప్రజల కోసం కాక కార్పొరేట్ల కోసం పనిచేస్తున్నట్లు చెప్పారు. సిద్ధార్థ లా కళాశాల ప్రిన్సిపాల్ దివాకర్‌బాబు ఎన్నికల బాండ్లు–ప్రజాస్వామ్యం అంశంగా మాట్లాడుతూ ఎన్నికల బాండ్లలో పారదర్శకత లేకుండా చేశారన్నారు. దేశంలోని నాలుగు ప్రధాన పార్టీలకు బాండ్లు అందినట్లు గుర్తు చేశారు. విరసం సభ్యుడు యుగంధర్ వందన సమర్పణ చేశారు. విరసం అధ్యక్షుడు అరసవిల్లి కృష్ణ కార్యక్రమాన్ని నిర్వహించారు.

యోగ సాధనతో సంపూర్ణ ఆరోగ్యం



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): యోగ సాధనతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని యోగ గురువు ప్రభాకర్ అన్నారు. బందరు రోడ్డులోని ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో స్ఫూర్తి కుటుంబం, ఆంధ్రప్రదేశ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం యోగ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశ్వస్ఫూర్తి గురువులు అనుగ్రహించిన 'ఆసన ప్రాణాయామ యోగ ప్రక్రియ' (ప్రస్థాన సాధన)లో విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. నిరంతరం యోగ సాధన చేయడం ద్వారా మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. రిటైర్డ్ రైల్వే కళాశాల అధ్యాపకులు కాదంబరి జ్యోతి 'మనసే అన్నింటికీ మూలం' అని మనసును అదుపులో పెట్టుకోవాలని సూచించారు. మనసుపై నియంత్రణతో శ్రేయస్కర జీవితం గడపవచ్చన్నారు. శిక్షణలో 33 మంది విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో స్ఫూర్తి కుటుంబం ఏపీ ట్రస్టీ చొప్పరపు నారాయణరావు, గ్రంథాలయ అధికారిణి కె. రమాదేవి, గుణశేఖర్, వలంటీర్లు పాల్గొన్నారు.

నగరాల అభ్యున్నతికి అండగా జగన్

- వైఎస్సార్ సీపీ విజయవాడ వెస్ట్ అభ్యర్థి షేక్ ఆసిఫ్
- నగరాల సామాజిక వర్గాన్ని బీసీల్లో చేర్చింది వైఎస్సార్
- అన్ని జిల్లాలకు వర్తింపజేసింది వైఎస్ జగన్
- మేయర్‌గా, దుర్గగుడి చైర్మన్‌గా నగరాలకు అవకాశం కల్పించారు
- టీడీపీ పాలనలో ఏనాడూ నగరాలను పట్టించుకోలేదు



షేక్ ఆసిఫ్‌కు మద్దతు తెలుపుతున్న నగరాల సంఘ నాయకులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): నగరాలు సామాజిక వర్గం అభ్యున్నతికి అండగా నిలిచిన ఘనత వైఎస్ రాజశేఖరరెడ్డి, ఆయన తనయుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మాత్రమే దక్కుతుందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పశ్చిమ అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థి షేక్ ఆసిఫ్ అన్నారు. శ్రీ నగరాల కులస్తుల రాష్ట్ర బీసీ సాధన కమిటీ ప్రధాన కార్యదర్శి కేఎస్ జగన్ ఆధ్వర్యంలో నగరాల సామాజికవర్గ ఆత్మీయ సమావేశం ఆదివారం స్థానిక కొరగంజి ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం నగరాలకు ఏమి మేలు చేసిందనే అంశాలతో రూపొందించిన కరపత్రాన్ని ఆసిఫ్ ఆవిష్కరించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆసిఫ్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఉత్తరాంధ్ర, ఉమ్మడి కృష్ణాజిల్లాలో అత్యధికంగా ఉన్న నగరాల సామాజికవర్గీయులు రాజకీయంగా చైతన్యవంతం కలిగిన వారన్నారు. రాజశేఖరరెడ్డి తన హయాంలో నగరాలు కులాన్ని బీసీ జాబితాలో కొన్ని జిల్లాల్లో గుర్తిస్తూ జీవో ఇచ్చారన్నారు. ఆయన తనయుడు జగన్‌మోహన్‌రెడ్డి సీఎంగా వచ్చిన తరువాత రాష్ట్రంలోని 26 జిల్లాల్లోనూ నగరాలను బీసీలుగా గుర్తిస్తూ జీవో ఇచ్చారన్నారు. దీనివలన నగరాల యువత ఉన్నత విద్యావకాశాలను పొందటమే కాకుండా తద్వారా మంచి ఉపాధి అవకాశాలను పొందేందుకు అవకాశం కలిగిందన్నారు. రాష్ట్రంలో ప్రధాన నగరమైన విజయవాడకు మేయర్‌గా నగరాల ఆడపడుచు రాయన భాగ్యలక్ష్మిని నియమించారని, రాష్ట్రంలో రెండో అతి పెద్ద ఆలయమైన దుర్గగుడికి చైర్మన్‌గా పైలా సోమినాయుడును నియమించారని వివరించారు. అనేక ప్రధాన ఆలయాలకు, కార్పొరేషన్లకు నగరాల కులస్తులను సభ్యులుగా నియమించారని, పలువురు కార్పొరేటర్లుగా కూడా ఎన్నికయ్యారని గుర్తు చేశారు. శ్రీశైలం దేవస్థానం వద్ద సుమారు 50 సెంట్ల స్థలాన్ని నగరాల సామాజికవర్గానికి కేటాయించారన్నారు. జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలని విజ్ఞప్తి చేశారు. చంద్రబాబు 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా ఉన్నా నగరాలకు ఏమీ మేలు చేయలేదన్నారు.

నగరాలు చేసిన మేలు మర్చిపోరు : కేఎస్ జగన్

నగరాల సామాజికవర్గం వారు తమకు మేలు చేసిన వారిని ఎప్పటికీ మర్చిపోరని శ్రీ నగరాల కులస్తుల రాష్ట్ర బీసీ సాధన కమిటీ ప్రధాన కార్యదర్శి కేఎస్ జగన్ అన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి నగరాలు అండగా ఉంటారని చెప్పారు. పశ్చిమంలో ఆసిఫ్‌కు, పార్లమెంట్ సభ్యుడు కేశినేని నాని గెలుపునకు అండగా ఉంటామని చెప్పారు. కార్యక్రమంలో దుర్గ కోఆపరేటివ్ బ్యాంక్ మాజీ చైర్మన్ కొరగంజి భాను, నాయకులు పోతిన వరప్రకాష్, ముదిలి మోహనరావు, ఇద్దిపిల్లి పవన్‌కుమార్, కె.నాగేశ్వరరావు, బీసీ నేతలు రంగారావు, కె.హేమంత్ తదితరులు పాల్గొన్నారు.

కౌంటర్లలో ఈవో ఆకస్మిక తనిఖీలు



ప్రసాదాల విక్రయ కౌంటర్‌లో సిబ్బందికి సూచనలు ఇస్తున్న ఈవో రామరావు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గగుడి ఈవో కేఎస్ రామరావు ఆదివారం ఆలయ ప్రాంగణంలో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. మహా మండపం గ్రౌండ్ ఫ్లోర్‌లోని ప్రసాదాల విక్రయ కౌంటర్లతో పాటు 7వ అంతస్తులోని మైక్ ప్రచార కేంద్రంలో తనిఖీలు నిర్వహించారు. ప్రసాద విక్రయ కౌంటర్లను తనిఖీ చేసిన క్రమంలో రోజు వారీ విక్రయాలు, ప్రసాదం స్టాక్ పాయింట్‌ను పరిశీలించారు. ప్రసాదాల కోసం క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులతో మాట్లాడిన ఈవో ఆలయ సిబ్బందికి సూచనలు చేశారు. అమ్మవారి ప్రసాదమైన పులిహోర ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చూడాలని సూచించారు. అనంతరం మైక్ ప్రచార కేంద్రానికి చేరుకుని సిబ్బందితో మాట్లాడారు. ఆలయంలో జరుగుతున్న నిత్యసేవలతో పాటు అన్న ప్రసాదం, మల్లేశ్వర స్వామి వారి దర్శనంతో పాటు ఆలయానికి జరిగే బంగారు తాపడం పనుల గురించి భక్తులకు తెలియజేయాలని సూచించారు.

రాష్ట్రానికి దిక్సూచి వైఎస్సార్ సీపీ మేనిఫెస్టో

వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి ఆకుల శ్రీనివాస్ కుమార్



వైఎస్సార్ సీపీ మేనిఫెస్టో కాపీలను ఆవిష్కరిస్తున్న ఆకుల శ్రీనివాస్ కుమార్

భవానీపురం(విజయవాడపశ్చిమ): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించిన ఎన్నికల మేనిఫెస్టో రాష్ట్రానికి దిక్సూచి వంటిదని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి ఆకుల శ్రీనివాస్ కుమార్ అన్నారు. విద్యాధరపురంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో మేనిఫెస్టో కాపీలను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీఎం జగన్ చెప్పారంటే..చేస్తారంతే...అన్న నమ్మకం ప్రజల్లో ఉందన్నారు. మేనిఫెస్టోను పవిత్ర గ్రంథంలా భావించి నూరు శాతం అమలు చేసిన ఏకైక పార్టీగా వైఎస్సార్ సీపీ దేశంలోనే గుర్తింపు పొందిందన్నారు. అమలు చేయగలిగిన హామీలనే సీఎం జగన్ ప్రకటించారన్నారు. సీఎం జగనన్న పథకాల వలన ఏపీ శ్రీలంకలా మారిపోతుందన్న చంద్రబాబు, అవే పథకాలను కాపీ కొట్టి సూపర్ సిక్స్ పేరుతో ప్రజల్లోకి వెళ్లటం సిగ్గుచేటన్నారు. మే 13న జరిగే పోలింగ్‌లో ఫ్యాన్ గుర్తుపై ఓటేసేందుకు ప్రజలందరూ సిద్ధంగా ఉన్నారని తెలిపారు. పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

జగన్ మరోసారి ముఖ్యమంత్రి కావటం తథ్యం



పోతిన మహేష్ తన అనుచరులతో ప్రదర్శిస్తున్న మేనిఫెస్టో కాపీలు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి ముఖ్యమంత్రి కావటం తథ్యమని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు పోతిన మహేష్ అన్నారు. పశ్చిమ అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థి షేక్ ఆసిఫ్, విజయవాడ ఎంపీ అభ్యర్థి కేశినేని నాని విజయాన్ని కాంక్షిస్తూ పోతిన మహేష్ తన అనుచరులతో ప్రత్యేక సమావేశాన్ని ఆదివారం తన కార్యాలయంలో నిర్వహించారు. నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు గుబ్బా చంద్రశేఖర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పోతిన మహేష్ మాట్లాడుతూ గత ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన నవరత్నాలను 99 శాతం అమలు చేసి సామాన్య ప్రజల జీవన ప్రమాణాలను పెంచారన్నారు. జగన్‌మోహన్‌రెడ్డికి లభిస్తున్న ప్రజాదరణ చూసి ఓర్వలేకే విజయవాడలో ఆయనపై దాడి చేశారని, ఆ మూడు పార్టీల అభ్యర్థులను ప్రజలు చిత్తుచిత్తుగా ఓడించాలని కోరారు. 10 సంవత్సరాలకు పైగా తన కష్టాన్ని పచ్చ నోట్లు ఇచ్చి దోచుకున్న సుజనాచౌదరి, నోట్ల కోసం అమ్ముకున్న పవన్ కల్యాణ్ నిజస్వరూపాలను ప్రజలు గ్రహించాలని కోరారు. పశ్చిమ నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ ప్రజాబలం ముందు వారి ధనబలం నిలవలేదన్నారు. రాబోయే ఎన్నికల్లో పశ్చిమాన అసెంబ్లీకి ఆసిఫ్, ఎంపీగా కేసినేని నాని భారీ మెజార్టీతో గెలుస్తారని చెప్పారు. సుజనాచౌదరి పశ్చిమ ప్రజల చేతిలో చావు దెబ్బ తినక తప్పదని హెచ్చరించారు. ప్యాకేజీ తీసుకునే స్థానిక నాయకులను నమ్మవద్దన్నారు. గుబ్బా చంద్రశేఖర్ మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిగా చేయటానికి అందరూ కలిసికట్టుగా పని చేయాలన్నారు. ఆసిఫ్‌ను, కేశినేని నానిని అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

కేశినేని నాని, ఆసిఫ్ గెలుపును కాంక్షిస్తూ ప్రార్థనలు

భవానీపురం(విజయవాడపశ్చిమ): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విజయవాడ పార్లమెంట్ అభ్యర్థి కేశినేని శ్రీనివాస్(నాని), పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి షేక్ ఆసిఫ్ గెలుపును కాంక్షిస్తూ వైఎస్సార్‌సీపీ నాయకులు చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పార్టీ నాయకులు సరగడ శంకర రెడ్డి, ఉండేల శ్రీనివాసరెడ్డి, మద్దా జోసెఫ్ శివమణి ఆదివారం 45వ డివిజన్ కొండ ప్రాంతం చివర ఉన్న ఒక చర్చికి వెళ్లి రానున్న ఎన్నికల్లో కేశినేని నాని, ఆసిఫ్ అత్యధిక మెజారిటీతో విజయం సాధించాలని, అలాగే మళ్లీ సీఎం జగనన్న నాయకత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి రావాలని పాస్టర్‌తో ప్రార్థనలు చేయించారు. మంచి మనసున్న వ్యక్తి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ రాష్ట్రానికి మళ్లీ ముఖ్యమంత్రి అయితేనే అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతుందని పేర్కొన్నారు.

ఎన్టీఆర్ జిల్లా సీపీ ఆకస్మిక తనిఖీ

నందిగామ: విధి నిర్వహణలో పోలీసు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్(సీపీ) పీహెచ్‌డి రామకృష్ణ సూచించారు. నందిగామ పోలీస్‌స్టేషన్‌ను ఆదివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్ రికార్డులు పరిశీలించారు. అనంతరం పట్టణంలోని జిల్లా పరిషత్ పాఠశాలలోని పోలింగ్ కేంద్రాన్ని, కెవిఆర్ కాలేజ్ లో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలించారు. ఈసందర్భంగా సీపీ రామకృష్ణ మాట్లాడుతూ విధి నిర్వహణలో అలసత్వం వహించే వారిపై కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట ఏసీపీ డాక్టర్ రవికిరణ్, ఇన్‌స్పెక్టర్ హనీష్ ఉన్నారు.

స్వచ్ఛమైన వేద విద్య అందిస్తున్నాం



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న మాంధాత

విజయవాడ కల్చరల్: విలువలతో కూడిన విద్యకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు కంచికామకోటి పీఠం ఇంటిగ్రేటెడ్ పాఠశాలల ఇన్‌చార్జి లక్ష్మీ మాంధాత తెలిపారు. లబ్బీపేటలోని శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో ఆదివారం విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ శ్రీ కంచికామకోటి పీఠంలో స్వచ్ఛమైన వేద విద్యను అందిస్తున్నామని, ఆయా పాఠశాలల్లో స్వయంగా సంప్రదించాలని సూచించారు. పీఠానికి వేద విద్యార్థులకు మధ్యవర్తులు లేరని ఆమె స్పష్టం చేశారు. పాఠశాలల నుంచి డొనేషన్లు తీసుకుంటున్నట్లు కొంతమంది ప్రచారం చేస్తున్నారని, అటువంటి అవసరం పీఠానికి లేదన్నారు. తమిళనాడు, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతి, విజయవాడ, మహబూబ్‌నగర్, ఇతర ప్రాంతాలలో జంబుకేశ్వరం,నాసిక్‌లో పాఠశాలల నిర్వహణ జరుగుతోందన్నారు. ఈ సందర్భంగా వివరాలతోకూడిన బ్రోచర్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో విష్ణుభొట్ల పద్మావతి, వాలెంటీర్ శ్రీరామ్ పాల్గొన్నారు.

చిన్నారి వైద్య ఖర్చులకు ఆర్థిక సాయం



చిన్నారి తల్లికి సాయం అందజేస్తున్న ఫౌండేషన్ సభ్యుడు భీమరాజు

భవానీపురం(విజయవాడపశ్చిమ): ప్రమాదవశాత్తు మెట్ల మీద నుంచి జారి పడిపోయి నడుము విరిగి హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న ఏడాదిన్నర వయసుగల చిన్నారి అంకిత్ వైద్య ఖర్చుల నిమిత్తం దీవెన ఫౌండేషన్ ఆర్థిక సహాయం అందజేసింది. విజయవాడ మధురానగర్‌కు చెందిన నరేష్, పావని దంపతులు ఒక ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో వారి కుమారుడు చిన్నారి అంకిత్‌కు అనుకోకుండా జరిగిన ప్రమాదానికి నిరుపేదలైన తల్లిదండ్రులు తల్లడిల్లిపోయారు. కుటుంబాన్ని పోషించుకోవడమే అంతంత మాత్రంగా ఉన్న తరుణంలో ఈ ప్రమాదాన్ని వారు తట్టుకోలేకపోయారు. కొడుకు అంకిత్‌ను నగరంలోని పలు ప్రైవేట్ హాస్పిటల్స్‌కు తీసుకువెళ్లి తమ శక్తికి మించి ఖర్చు చేశారు. అయినా ఫలితం కనబడకపోవడంతో చివరికి ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించి చికిత్స చేయిస్తున్నారు. ఈ నేపథ్యంలో వారు దీవెన ఫౌండేషన్ సభ్యులను సహాయం కోసం ఆశ్రయించారు. దీంతో ఫౌండేషన్ సభ్యుడు కానిస్టేబుల్ భీమరాజు ఆదివారం ఆస్పత్రికి వెళ్లి రూ.15.500 నగదు అందజేశారు. ఫౌండేషన్ సభ్యులకు చిన్నారి తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలియజేశారు.

అమ్మవారి దర్శనానికి పోటెత్తిన భక్తులు



క్యూలైన్‌లో పొంగళ్లతో భక్తులు

పెనుగంచిప్రోలు:గ్రామంలో వేంచేసియున్న శ్రీ తిరుపతమ్మ అమ్మవారి దర్శనానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. సెలవుదినం కావటంతో పాటు పలు శుభకార్యాలు ఉండటంతో అమ్మవారి దర్శనానికి వివిధ జిల్లాల నుంచి భక్తులు వేలాదిగా తరలివచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడతో ఆలయ క్యూలైన్లు, పరిసరాలు కిక్కిరిశాయి. వేకువజాము నుంచే భక్తులు పాలుపొంగళ్లతో అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఎండ తీవ్రత తట్టుకోలేక భక్తులు మధ్యాహ్న సమయంతో మునేరు అవతల మామిడి తోటల్లో సేద తీరారు. వేసవి తీవ్రత దృష్ట్యా ఆలయ అధికారులు, గుంటూరుకు చెందిన యలమంచలి అభిరామ్ సౌజన్యంతో భక్తులకు మజ్జిగ పంపిణీ చేశారు.



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

267 మద్యం సీసాలు స్వాధీనం

జగ్గయ్యపేట:ఒక ఇంటిలో అక్రమంగా నిల్వ ఉంచిన మద్యం సీసాలను గుర్తించి స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఈబీ సీఐ మణికంఠరెడ్డి ఆదివారం తెలిపారు. మండలంలోని చిల్లకల్లు గ్రామంలో మద్యం అక్రమంగా నిల్వచేసినట్లు సమాచారం అందడగంతో ఎస్ఈబీ సిబ్బందితో కలిసి దాడి చేసినట్లు సీఐ వివరించారు. గ్రామానికి చెందిన గొట్టిముక్కల పార్వతి నివాసంలో 267 మద్యం సీసాలను గుర్తించి స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. మద్యం సీసాలను గ్రామానికి చెందిన వెంకటేశ్వరరావు, పీట్ల వెంకటేశ్వరరావు సరఫరా చేసినట్లు తమ విచారణలో తేలిందన్నారు. ఈ కేసుకు సంబంధించి సదరు మహిళను అదుపులోకి తీసుకోగా, మిగిలిన ఇద్దరు పరారీలో ఉన్నట్లు సీఐ తెలిపారు.

అంకమ్మతల్లికి కుంకుమ పూజలు



మధురానగర్(విజయవాడసెంట్రల్): మధురానగర్ నేతాజీకాలనీలోని శ్రీ అంకమ్మతల్లి శక్తిపీఠంలో ఆదివారం అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిగాయి. పీఠం వ్యవస్థాపకులు అన్నాబత్తుల శరాబందీరావు అమ్మవారికి ప్రీతికరమైన కుంకుమార్చనలు, శ్రీ చక్రార్చనలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.